శుభాకాంక్షలు



గచ్చిబౌలి: మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికైన సందర్భంగా ఆయనను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మర్యాద పూర్వకంగా నగరంలోని ఆయన నివాసంలో శనివారం కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

- షబ్బీర్‌అలీని కలిసిన జగదీశ్వర్‌గౌడ్



తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంక్షేమ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన మహ్మద్ షబ్బీర్ అలీని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ శనివారం సచివాలయంలో ఆయనను కలిశారు. శాలువాతో సత్కరించారు. పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన



గోపీనగర్ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

శేరిలింగంపల్లి: డివిజన్ పరిధిలోని గోపీనగర్‌లో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ శనివారం పర్యటించారు. గోపీనగర్‌లో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో చేయడంతోపాటు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు వీరేశంగౌడ్, రాజేశ్వరమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు మహేందర్‌గౌడ్, పర్వీన్ బేగం, కెఎస్ రాములు, దాకయ్య గౌడ్, లీలానంద్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, శ్రీకాంత్, మహేందర్‌సింగ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూలో చేరిన కార్మికులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో శనివారం భవన నిర్మాణ కార్మికులు సీఐటీయూలో చేరారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాడుతుందన్నారు. అసంఘటిత కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్, ప్రమాద బీమా, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులు పేదరికంలో మగ్గుతున్నారన్నారు.కాగా ఈ నెల 16న జరిగే సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు, నాయకులు భిక్షపతి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీఎస్‌ఎస్‌ఆర్‌కు ఎంపికైన అపరాజితమిశ్రా



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన పరిశోధక విద్యార్థిని అపరాజిత మిశ్రా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ (ఐసీఎస్ఎస్ఆర్) డాక్టోరల్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. అంతేకాకుండా నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) కూడా క్వాలిఫైడ్ అయ్యారు. ఇటీవలే ఆమెకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ఆమె హెచ్‌సీయూ ప్రొ.శివ ప్రసాద్, డాక్టర్ అలోక్‌కుమార్ పాండే పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు పరిశోధక, ఇతర విద్యార్థులు అభినందించారు.

విద్యార్థికి చేయూత



నగదు అందజేస్తున్న కొండా విజయ్‌కుమార్

శేరిలింగంపల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హోప్ ఆధ్వర్యంలో చందానగర్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి విఘ్నేష్‌కు రూ.20 వేల ప్రోత్సాహకాన్ని ఆ క్లబ్ వ్యవస్థాపకులు కొండా విజయ్‌కుమార్ శనివారం అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు లయన్స్ క్లబ్ సహకారం ఉంటుందన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ అధ్యక్షులు తోపుగుండ మహిపాల్ రెడ్డి, సభ్యులు మధుసూదన్‌రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌తో పాటు నగదు చోరీ

- రూ.ఒక లక్ష 61 వేలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: ఫోన్ చోరీకి గురైన సంఘటనలో ఫోన్‌లో ఉన్న నగదు రూ. ఒక లక్ష 61 వేలు మాయమైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన వెంకట్‌రెడ్డి(70) మంగళవారం సాయంత్రం కాలనీలో జరిగే సంతకు వెళ్లాడు. అయితే కూరగాయలు కొనే చోట అతని ఫోన్‌ని దొంగలించారు.కాగా వెంకట్‌రెడ్డి ఫోన్ నంబర్ కు మూడు బ్యాంక్ ఖాతాలు, లింక్ అయి ఉండడంతో, అతడి జీ మెయిల్ ఆధారంగా అపరిచిత వ్యక్తి అతని మూడు ఖాతాల్లో ఉన్న రూ. ఒక లక్ష ,61 వేలు నగదును డ్రా చేసినట్లు బాధితుడు పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మార్చి10న కిడ్నీ రన్

- పోస్టర్‌ను ఆవిష్కరించిన ఏఐఎన్‌యూ వైద్యులు



మాదాపూర్ బుట్టా కన్వెన్షన్‌లో పోస్టర్ విడుదల చేసిన డాక్టర్లు

మాదాపూర్: ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ప్రజలలో అవగాహన పెంచే విధంగా మార్చి 10న నిర్వహించనున్న కిడ్నీరన్ పోస్టర్‌ని మాదాపూర్‌లో శనివారం విడుదల చేశారు. ప్రజలకు కిడ్నీ సమస్యలపై, ఆరోగ్యంపై పూర్తి అవగాహన కల్పించాలని ఏఐఎన్‌యూ హాస్పిటల్ హైటెక్ సిటీ శాఖాధిపతి యూరాలజిస్ట్ డాక్టర్ దీపక్ రాగూరి అన్నారు. ఏఐఎన్‌యూ(ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ) ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో రన్ ఉంటుందని తెలిపారు.





చేనేతతో..అందం, ఆరోగ్యం

- శిల్పారామంలో గాంధీ బంకర్ మేళా..
- ప్రత్యేక ఆకర్షణగా ఖాదీ ఉత్పత్తులు
- రోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు
- సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ
- ఈ నెల 8వ తేదీ వరకు అందుబాటులో..



మేళాలో కొనుగోలుదారుల సందడి

మాదాపూర్: చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో డెవలప్‌మెంట్ కమిషనర్ హ్యాండ్‌లూమ్స్, మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన నేషనల్ హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో గాంధీ బంకర్ మేళాకు మంచి స్పందన వస్తోంది. కాటన్ దుస్తులు అందంతో బాటు శరీరానికి కావల్సిన చల్లదనాన్ని ఇస్తాయనేది తెలిసిందే. అలాగే హుందాతనాన్ని కూడా ఇస్తాయి. చేనేతను ప్రోత్సహించాలనే పిలుపు మేరకు ప్రజలు కూడా కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ మేళాలో మహిళలకు కావాల్సిన ప్రత్యేక డిజైన్‌లను ఆర్డర్‌పై సైతం అందిస్తున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు మేళా అందుబాటులో ఉంటుందని, అలాగే ప్రతి రోజు సాయంత్రం ఆంఫీ థియేటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. దాదాపు 50కిపైగా స్టాల్స్ అందుబాటులో ఉన్నాయి. ఉప్పాడ, పోచంపల్లి, గద్వాల్ గొల్లభామ, బెంగుళూరు సిల్క్, కొస పట్టు , కాటన్ బెడ్‌షీట్స్ అందుబాటులో ఉన్నాయి. మేళాలో భాగంగా రోజు సాయంత్రం 5.30 గంటలకు కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ, సంగీత కచేరీ ప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకుంటున్నారు.

చీరలు ఎక్కువగా అమ్ముడవుతున్నాయి..



నగరవాసులు చేనేత చీరలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రత్యేక డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయి. చేనేత వస్త్రాల వల్ల చర్మవ్యాధులు రాకుండా ఉంటాయి. హుందాగా, ఆరోగ్యంగా ఉంటారు. సందర్శకులకు కావాల్సిన డిజైన్‌లను ఆర్డర్‌లపై కూడా అందిస్తాం.

–కళావతి స్టాల్ నిర్వాహకురాలు



నయనానందకరం.. నృత్య ప్రదర్శన

మాదాపూర్: నేషనల్ హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పోలో భాగంగా శనివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఇషా ఫౌండేషన్ ప్రాజెక్టు సంస్కృతి బెంగుళూరుకి చెందిన కళాకారులు పద్మాక్షభూపతి, జనప్రియ మురుగన్ భరతనాట్య ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. ఇందులో తోడయ మంగళం, రామాష్టకమ్ , తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు.

కూచిపూడి నృత్యార్చన

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీ త్రినేత్ర ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు కూచిపూడి నృత్యార్చన చేశారు. అకాడమీ గురువు భారతీదేవి శిష్య బృందం తన్మయి, రుక్షిత, హోత్ర, విహాన, యశ్విత, దాక్షిణ్య, వైష్ణవి, కుందనప్రియ, నిత్య సంతోషినిలు పలు నృత్యాంశాలను ప్రదర్శించారు. అనంతరం సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ శోభారాజు కళాకారులను సత్కరించారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 30, పచ్చిమిర్చి 50–60, బెండ 60, కాకర 60, దొండ 40, దోస 30, ఆలు 25, చామ 60, కీర 30, బీర 60, వంకాయ 30, గోకర 60, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 25, క్యారెట్ 40, చిక్కుడు 40, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 260, వెల్లుల్లి 260.

కార్పొరేటర్ పర్యటన

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని జేపీ కాలనీలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ శనివారం పర్యటించారు. కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.జె.పి కాలనీలో మురుగునీరు రోడ్లపై నిలుస్తుందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా పారిశుద్ధ్య కార్మికులతో డ్రైనేజీ లైన్‌ను క్లీన్ చేయించారు.

విరాళం అందజేత

ఆల్విన్‌కాలనీ: ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా శనివారం రాందేవ్‌రావ్ ఆసుపత్రి దత్తత తీసుకున్న 9 నుంచి 15 సంవత్సరాలలోపు పాఠశాల బాలికలకు సర్వైకల్ కేన్సర్ నివారణ కోసం ఉచితంగా వ్యాక్సిన్ అందజేశారు. ప్రతి బుధవారం, శనివారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా బాచుపల్లికి చెందిన మెరుగు సుచరిత 60 వేల రూపాయలను రాందేవ్‌రావ్ ఆసుపత్రి యాజమాన్యానికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం, డాక్టర్ ఛాయాదేవిలు సుచరిత, ఆమె కుటుంబ సభ్యులను అభినందించారు.

హెచ్‌సీయూలో క్లీనప్ డ్రైవ్



రాయదుర్గం: గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని ఎన్ఎస్ఎస్ పార్కులో శనివారం 'క్లీనప్ డ్రైవ్' నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, శానిటేషన్, హార్టికల్చర్ విభాగం సిబ్బంది, డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ క్యాంపస్‌లో పచ్చదనం, పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా చేయడంతో పూర్తిగా ఎన్ఎస్ఎస్ సెల్ సహకరిస్తుందన్నారు.హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భీంసింగ్, వాలంటీర్లు సుధాకర్, హరిప్రసాద్, ప్రకాశ్, యాదయ్య, శానిటేషన్ సిబ్బంది, విద్యార్థులు శ్రమదానం చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మియాపూర్ : ప్రశాంత్‌నగర్ కాలనీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం మియాపూర్ ప్రశాంత్‌నగర్‌లో పర్యటించి సమస్యలను పరిశీలించారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట..

సైబర్ వలలో పడి రూ.30 లక్షలు పోగొట్టుకున్న వ్యక్తి

పటాన్‌చెరు టౌన్: నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో ఓ వ్యక్తి రూ.33 లక్షలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని పిజెఆర్ ఎన్‌క్లేవ్‌కు చెందిన ఆన్‌లైన్ ట్రేడింగ్ నిర్వహించే వ్యక్తికి డిసెంబర్ 21 తేదీన ట్రేడింగ్‌కు సంబంధించిన ఒక మెసేజ్ వచ్చింది. దీంతో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేశాడు. దీంతో అపరిచితులు ఒక ఐడిని క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఆ వ్యక్తి నగదు ను ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ చేస్తు వచ్చాడు. పెట్టిన నగదుతో పాటు, కమిషన్ చూపిస్తూండడంతో బాధితుడు పలు దఫాలుగా రూ.30 లక్షలు ఇన్వెస్ట్ చేశాడు. తర్వాత తాను పెట్టిన నగదుతో పాటు రెట్టింపైన నగదును ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జవహర్‌నగర్‌లో సీసీ కెమెరాలు ప్రారంభం

శేరిలింగంపల్లి: చందానగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్‌లో సుమారు రూ.2.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు. కార్పొరేటర్లు మంజుల రఘునాథ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డితో కలిసి 30 సీసీ కెమెరాలను శనివారం ప్రారంభించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన గోపాల్‌ను ఎమ్మెల్యే గాంధీ అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐలు నాగేశ్వర్‌రావు, రఘు, మాజీ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ గౌడ్, రవీందర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, నాయకులు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పల్లెను ప్రగతికి తార్కాణంగా తీర్చిదిద్దాం..

- రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- తాజా మాజీ సర్పంచులకు సత్కారం

పటాన్‌చెరు: ప్రజాస్వామ్యంలో పదవులు అత్యంత బాధ్యతతో కూడుకున్నవని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తే ప్రజల ఆశీర్వాదం పొందవచ్చని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో.. తాజా మాజీ సర్పంచులకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులను శాలువాలతో సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాదంతో ఐదు సంవత్సరాల పాటు గ్రామాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా జనాభా సంఖ్యకు అనుగుణంగా ప్రతి నెలా నిధులు విడుదల చేస్తూ మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీలు దేవానందం, సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, ప్రవీణ విజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీలు సుప్రజా వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సర్పంచులను సన్మానించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాలకు రాజమార్గం 'గేట్'

పటాన్‌చెరు టౌన్: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) అనేది ప్రతిష్టాత్మక సంస్థలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు చదవడానికి మార్గం మాత్రమే కాదు, ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ), పరిశోధనా కేంద్రాలు, ఇతర సాంకేతిక విభాగాలలో విస్తృత శ్రేణి ఉపాధి అవకాశాలకు బాటలు వేస్తుందని హైదరాబాద్‌లోని ఏస్(ఏసీఈ) ఇంజనీరింగ్ అకాడమీ అధ్యాపకుడు త్రినాథ్ అన్నారు.గీతం విశ్వవిద్యాలయంలోని, కెరీర్ గైడెన్స్ కేంద్రం ఆధ్వర్యంలో 'ప్రభుత్వ రంగ సంస్థలలో ఉపాధి అవకాశాలు' అనే అంశంపై శనివారం ఆయన అతిథ్య ఉపన్యాసం ఇచ్చారు.ఇంజనీరింగ్ పట్టభద్రుల భవిష్యత్తును రూపొందించడంలో గేట్ ప్రాముఖ్యతను వివరించారు.గేట్ నుంచి మార్కులను సాధించడం ద్వారా భారతదేశంలోని ఐఐఎస్సీ, ఐఐటీలు, ట్రిబుల్ ఐటీలు,ఎన్ఐటీల వంటి ప్రముఖ సాంకేతిక విద్యా సంస్థలలో మాస్టర్స్ (పీజీ)ని అభ్యసించడమే గాక, ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగం పొందడానికి ఉపకరిస్తుందన్నారు. మనదేశంలోని ప్రధాన సీపీఎస్‌యూలలో తాజా ఇంజనీరింగ్ పట్టభద్రులకు ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయని, ఇక్కడ ప్రాథమిక అర్హత కోసం గేట్ తప్పనిసరి అని చెప్పారు. దీనికి అదనంగా, భారత రక్షణ పరిశోధన,అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో), భారత అంతరిక్ష సంస్థ (ఇస్రో), బాబా అణు పరిశోధనా కేంద్రం (బార్క్) వంటి నాన్-పీఎస్ యూ కేంద్ర ప్రభుత్వ సంస్థలు కూడా గేట్ స్కోర్‌ల ఆధారంగా అభ్యర్థులను నియమించుకుంటాయని త్రినాథ్ వివరించారు. ఏస్ ఇంజనీరింగ్ అకాడమీ అందించే సేవలు,శిక్షణ, స్వల్ప వ్యవధి సర్టిఫికెట్ కోర్సులను వివరించడంతో బాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

మురుగుమయంగా మల్కంచెరువు



రాయదుర్గం: రాయదుర్గంలోని మల్కంచెరువును ఇటీవల రూ.30 కోట్లతో సుందరీకరించారు. వాకింగ్‌ట్రాక్, సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేశారు. కానీ చెరువులో మురుగునీరు చేరుతుందని రెండు రోజులుగా చెరువు నుంచి భరించలేని దుర్వాసన వస్తోందని వాకర్స్ తెలిపారు. చెరువులోకి మురుగునీరు రాకుండా ప్రత్యేక పైప్‌లైన్ వేశారు. ఒక వేళ వచ్చినా దాన్ని మూడు దశల్లో శుభ్రంచేసి చెరువులోకి వదిలే ఏర్పాట్లు కూడా చేశారు. అయితే కోట్ల రూపాయలు పెట్టి సుందరీకరించినా ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని వాకర్స్ కోరుతున్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



ఆటో డ్రైవర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్ : ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని ఎమ్మెల్యే గాంధీ డిమాండ్ చేశారు. ఉపాధి లేక ఇటీవల ప్రజాభవన్ ముందు ఆటోను తగులబెట్టుకున్న డ్రైవర్ ఎం.దేవులనాయక్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. మియాపూర్‌లోని నడిగడ్డతండాలో నాయక్ ఇంటికి వెళ్లి మాట్లాడారు. అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం అనాలోచిత విధానాలతో ఒక్క హామీ అమలు చేసే హడావిడిలో మరో వర్గాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్న తీరు కనపడుతుందన్నారు. ప్రజాభవన్ ఘటనపై ముఖ్యమంత్రి ఇప్పటి వరకు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఒకరికి పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం 07 మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా, అందులో ఒక్కరికి పాజిటివ్ నిర్ధారణ అయిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు.అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 04 నిర్వహించినట్లు తెలిపారు.

నిథమ్ తాత్కాలిక డైరెక్టర్‌గా నిఖిలారెడ్డి

- ప్రస్తుత డైరెక్టర్ డా.చిన్నంరెడ్డిని రిలీవ్ చేస్తూ జీఓ జారీ

రాయదుర్గం: నిథమ్ డైరెక్టర్ డాక్టర్ చిన్నంరెడ్డిని రిలీవ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో తాత్కాలికంగా రాష్ట్ర పర్యాటక శాఖ డైరెక్టర్ ,టీఎస్‌టీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఐఏఎస్ అధికారి కె నిఖిలారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. నూతన డైరెక్టర్ నాయకత్వంలో నిథమ్ పురోభివృద్ధి సాధిస్తుందని అధికారులు, ఉద్యోగులు స్పష్టం చేశారు.